

ఆదిత్యుని ఆదాయం రూ.7.02 లక్షలు

అరసవల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రత్యక్షదైవం.. ఆరోగ్యప్రదాత.. అరసవల్లిలో శ్రీ సూర్యనారాయణ స్వామిని ఆదివారం పెద్ద ఎత్తున భక్తులు దర్శించుకున్నారు. క్యూలైన్లు కిటకిటలాడాయి. ఇంద్రపుష్కరిణి, కేశఖండన శాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. ఆదివారం ఒక్క రోజే ఆదిత్యుడికి రూ.7,02,788 ఆదాయం లభించింది. ఇందులో టిక్కెట్ల ద్వారా రూ.4,15,200, విరాళాల రూపంలో రూ.91,388, ప్రసాదాల అమ్మకం ద్వారా రూ.1,96,200 సమకూరిందని ఆలయ అధికారులు తెలిపారు.

కొత్త టవర్లు.. పాత కష్టాలు!

- గిరిజన ప్రాంతాల్లో నెట్‌వర్క్ సమస్యలు
- సిగ్నల్స్ కోసం పాట్లు
- పట్టించుకోని అధికారులు



మెళియాపుట్టి మండలం పెద్దకేదారి గ్రామ సమీపంలో 700 మెగా హెడ్ ఫ్రీక్వెన్సీతో ఇటీవల బీఎస్ఎన్ఎల్ టవర్ నిర్మించారు. దీని సామర్థ్యం ప్రకారం 3.5కిలోమీటర్ల దూరంలోని గ్రామాల్లో సైతం నెట్‌వర్క్ ఉండాలి. కానీ అక్కడ 4జీ, 5జీ సెల్‌ఫోన్లు లేనివారికి నెట్‌వర్క్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గడపలో, ఇంటి బయట ప్రాంతాల్లో ఇతర నెట్‌వర్క్ సిగ్నల్స్ కూడా రాకపోవడంతో అవస్థలు పడుతున్నారు.

- మెళియాపుట్టి మండలం మూలనేలబొంతు, రింపి, గొట్టిపల్లి, కేరాశింగి బందపల్లి గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ కొత్త టవర్లు నిర్మించారు. ఇక్కడ కూడా 700 మెగా హెడ్ ఫ్రీక్వెన్సీతో టవర్లు ఏర్పాటు చేయగా.. నెట్‌వర్క్ రాక ఇబ్బందులు పడుతున్నారు. నెట్‌వర్క్ సమస్యతో సచివాలయ సిబ్బందికి, ప్రజలకు అవస్థలు తప్పడం లేదు.



నరహరిపురం జీసీసీ డిపోలో నెట్‌వర్క్‌లేక.. చెట్టు వద్ద ఫోన్ ఇలా..



నరహరిపురంలో సిగ్నల్స్ కోసం రేషన్ లబ్ధిదారుల పాట్లు


మెళియాపుట్టి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి)

గిరిజన ప్రాంతాల్లో సెల్‌టవర్లు ఉన్నా.. నెట్‌వర్క్ సమస్యలు వెంటాడుతున్నాయి. సిగ్నల్స్ సక్రమంగా అందక ఉద్యోగులకు, ప్రజలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మారుమూల గ్రామాల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట సెల్‌టవర్లు మంజూరు చేసింది. స్థల సమస్య కారణంగా అధికంగా టవర్లు ఏర్పాటు పూర్తికాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్యలు పరిష్కరించి.. టవర్లు ఏర్పాటు చేసింది. కానీ, ప్రస్తుతం సిగ్నల్ సమస్య వెంటాడుతోంది.

టవర్లు ఉన్నా.. ప్రయోజనమేదీ

సీతంపేట ఐటీడీఏ పరిధిలో రెండేళ్ల కిందట 64 సెల్ టవర్లు మంజూరయ్యాయి. వాటికి అవసరమైన స్థలసేకరణ బాధ్యతను ఐటీడీఏకు ప్రభుత్వం అప్పగించింది. టవర్ల నిర్మాణానికి ట్రికార్ నిధులు సైతం మంజూరు చేసింది. సీతంపేట మండలంలో 42, మెళియాపుట్టి మండలంలో 15, నందిగాం, భామిని, హిరమండలం, కొత్తూరు, పాతపట్నం మండలాల్లో ఒక్కో టవర్ నిర్మించారు. కాగా అన్నిచోట్లా నెట్‌వర్క్ సమస్యలు కనిపిస్తున్నాయి. సిగ్నల్ సమస్య కారణంగా ప్రభుత్వ పథకాలు అందడం లేదని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్ సరుకులు, పింఛన్లకు సంబంధించి బయోమెట్రిక్ నమోదు కావడం లేదని వాపోతున్నారు. సాంకేతిక సమస్య పరిష్కరించాలని కోరుతున్నా పట్టించుకునే నాథులు కరువయ్యారని ఆరోపిస్తున్నారు. ఈ నెల నుంచి డీలర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారు. కాగా.. గిరిజన ప్రాంతాల్లో జీసీసీ డిపోల వద్దకు నెట్‌వర్క్ అందడం లేదు. దీంతో చెట్ల కొమ్మల వద్ద ఓ బాక్స్‌లో సెల్‌ఫోన్లు ఉంచి.. అక్కడి నుంచి వైఫై ద్వారా చెరువు గట్టు వద్ద బయోమెట్రిక్ వేయిస్తున్నారు. అలాగే సచివాలయాలకు నెట్‌వర్క్ అందక సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కిటికీలు, బయట ప్రాంతాల్లో బాక్సులు అమర్చుతున్నారు. అందులో ఫోన్ ఉంచి సిగ్నల్స్ కోసం పాట్లు పడుతున్నారు. నెట్‌వర్క్ సమస్య పరిష్కారం కావాలంటే 2100 మెగా హెడ్ ఫ్రీక్వెన్సీ టవర్లు ఏర్పాటు చేయాల్సి ఉందని (మిగతా 8వ పేజీలో..)

ఈఏపీసెట్‌లో మెరిశారు



విక్రమరాజ, ప్రణీత్‌సాయి, రోహిత్ దత్త
నిర్మిత్, లక్ష్మీనివాస్, సుమిత్
ప్రశాంత్, వెంకటశ్రీ వినయ్, చరణ్ సాయి

- జిల్లా విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు

శ్రీకాకుళం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, అగ్రికల్చర్‌లో ప్రవేశానికిగాను నిర్వహించిన ఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. రాష్ట్రస్థాయిలో 9వ ర్యాంకును ఓ విద్యార్థి కైవసం చేసుకోగా.. పలువురు జిల్లా టాపర్లుగానూ నిలిచారు.

- ఇంజనీరింగ్ విభాగంలో.. జిల్లా నుంచి 5,548 మంది బాలురు, 3,886 మంది బాలికలు.. మొత్తం 9,434 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 9,062 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు హాజరయ్యారు. ఆదివారం ఫలితాలు విడుదల కాగా.. 6,402 మంది ఉత్తీర్ణులయ్యారు. 3,711 మంది బాలురు, 2,691 మంది బాలికలు ఉత్తీర్ణత సాధించారు.
- అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో... జిల్లా నుంచి 3,864 మంది విద్యార్థులు(691 మంది బాలురు, 3,173 మంది బాలికలు) పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 3,571మంది పరీక్షకు హాజరయ్యారు. 3,135 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇందులో 579 మంది బాలురు, 2,556 మంది బాలికలు ఉన్నారు.

ఇంజనీరింగ్ విభాగంలో జిల్లా టాపర్లు..


పేరు	ర్యాంకు	ప్రాంతం	స్కోరు
ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి	9	నరసన్నపేట	92.5155
బుడుమూరు విక్రమరాజ	21	ఎచ్చెర్ల	91.4935
సిగిలిపెల్లి ప్రణీత్‌సాయి భరత్	63	టెక్కలి	87.7342
బండారు రోహిత్ దత్త	83	ఎచ్చెర్ల	86.2985
సానవపురి నిర్మిత్	128	పాతపట్నం	83.7282
బోయిన లక్ష్మీనివాస్	148	శ్రీకాకుళం	83.0967
కరకవలస సుమిత్	163	ఆమదాలవలస	82.4487
పప్పు ప్రశాంత్ కార్తీక్	166	పాతపట్నం	82.3104
పైడి వెంకటశ్రీ వినయ్	180	పొందూరు	81.9540
లుకలాపు చరణ్ సాయి	204	సారవకోట	80.9884

అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో జిల్లా టాపర్లు..

పేరు	ర్యాంకు	ప్రాంతం	స్కోరు
సూరపు ఝాన్సీలక్ష్మీ శృతి	11	నరసన్నపేట	91.0829
సనపల వెంకటసాయి శ్రీనివాస్	17	సరుబుజ్జిలి	89.7888
తార్ర మైత్రి	33	పోలాకి	88.3352
గొద్దు యామిని	42	కోటబొమ్మాళి	87.8351
లకినాన శ్రీకర్ కశ్యప్	133	కాశీబుగ్గ	82.9176
దాసరి సాయిచరణ్	172	సంతబొమ్మాళి	81.7184
కుసుమూరు మౌళి	177	శ్రీకాకుళం	81.6207
చాపల స్థితప్రజ్ఞ	180	లావేరు	81.5021
నక్కా నిఖిల్ సాయి కృష్ణ	185	అరసవల్లి	81.2593
ప్రణతి వైశ్యరాజు	193	హిరమండలం	81.1242



జ్ఞానరుత్విక్‌కు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు



ఝాన్సీలక్ష్మీ, వెంకటసాయి, మైత్రి, యామిని
శ్రీకర్ కశ్యప్
సాయిచరణ్, మౌళి
స్థితప్రజ్ఞ
నిఖిల్, ప్రణతి

శభాష్ జ్ఞాన రుత్విక్

- ఈఏపీసెట్‌లో రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకు

నరసన్నపేట/ ఎచ్చెర్ల/సరుబుజ్జిలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈఏపీసెట్ ఫలితాల్లో నరసన్నపేట మండలం దేవాది గ్రామానికి చెందిన ధర్మాన జ్ఞాన రుత్విక్‌సాయి రాష్ట్రస్థాయిలో తొమ్మిదో ర్యాంకు సాధించారు. ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఆలిండియాస్థాయిలో 18వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో ఒకటో స్థానం సాధించిన విషయం తెలిసిందే. జ్ఞాన రుత్విక్‌సాయి తల్లిదండ్రు లిద్దరూ ఉపాధ్యా యులే. తల్లి కొండల లత నరసన్నపేట బాలికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలు. తండ్రి ధర్మాన శంకరనారాయణ చెన్నాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. జ్ఞాన రుత్విక్‌సాయిని కుటుంబ సభ్యులు, బంధువులు అభినందించారు.

- నరసన్నపేటలోని మారుతీనగర్‌కు చెందిన డా. సూరపు ఝాన్సీ లక్ష్మీ శృతి ఏపీఈఏపీసెట్‌లో అగ్రికల్చర్ అండ్ ఫార్మసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించారు. తండ్రి డా.కృష్ణారావు పాతపట్నం సామాజిక ఆసుపత్రిలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. తల్లి మెండ సుధారాణి చిన్నపిల్లలు వైద్యనిపుణులు. నీట్‌లో ప్రతిభ చూపి.. వైద్యవృత్తిలో స్థిరపడటమే తన లక్ష్యమని ఝాన్సీ లక్ష్మీశృతి తెలిపారు.
- సరుబుజ్జిలి మండలం పురుషోత్తపురం పంచాయతీ సీతారామ్‌నగర్ కాలనీకి చెందిన సనపల వెంకటసాయి శ్రీనివాస్ 17వ ర్యాంకు సాధించాడు. ఈయన తండ్రి అప్పలనాయుడు ప్రభుత్వ అధ్యాపకుడు కాగా, తల్లి గృహిణి.
- ఎచ్చెర్ల మండలం అల్లినగరంలో నివాసం ఉంటున్న పొందూరు మండలం పిల్లలవలస గ్రామానికి చెందిన బుడుమూరు విక్రమరాజా ఈఏపీ సెట్ ఫలితాల్లో 21వ ర్యాంకు సాధించారు. ఇటీవల జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో కూడా ఓపెన్ కేటగిరీలో 216వ ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 30వ ర్యాంకు దక్కించుకున్నారు. విక్రమరాజా తండ్రి సోమరాజు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు కాగా, తల్లి కళ్యాణి ఓ ప్రైవేటు పాఠశాలలో పనిచేస్తున్నారు.

మరిన్ని వివరాలు.. 7లో

సమాచారం

నేడు జిల్లావ్యాప్తంగా యోగా ర్యాలీలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9న జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో యోగా ర్యాలీలు నిర్వహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలు ర్యాలీలో పాల్గొనాలని ఆదివారం ఒక ప్రకటన ద్వారా పిలుపునిచ్చారు. 'సోమవారం ఉదయం 7 గంటల నుంచి యోగా ర్యాలీలు ప్రారంభమవుతాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల నుంచి జిల్లాస్థాయి ర్యాలీ ప్రారంభిస్తాం. గ్రామ/వార్డుస్థాయిలో సచివాలయ సిబ్బంది, ప్రజలతో కలిసి ర్యాలీలు నిర్వహించాల'ని తహసీల్దార్లు, ఎంపీడీవోలను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణ, ప్రథమ చికిత్స ఏర్పాట్లను ఆయా శాఖలు చూసుకోవాలన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, సెట్‌శ్రీ మేనేజర్, ఆయుష్ శాఖ అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు చేయాలని సూచించారు.

నేటి నుంచి జిల్లాస్థాయి యోగా పోటీలు 7లో

కరోనాపై అప్రమత్తం

అరసవల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కరోనా వైరస్ వ్యాప్తిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఇటీవల దేశవ్యాప్తంగా కొవిడ్ కేసులు విస్తరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని పీహెచ్‌సీల వైద్యాధికారులను అప్రమత్తం చేశాం. జిల్లాలో గ్రామ దేవత సంబరాల నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతీ ఒక్కరూ మాస్క్‌లు ధరించాలి. సమూహాలుగా ఉండరాదు. చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలి. శానిటైజర్‌ను వినియోగించాలి. జ్వరం, దగ్గు, అలసట, గొంతునొప్పి, రుచి, వాసన కోల్పోవడం, తలనొప్పి, జలుబు, నీళ్ల విరేచనాలు తదితర లక్షణాలు కనిపిస్తే కొవిడ్ పరీక్షలు చేయించుకోవాలి. శ్రీకాకుళంలోని రిమ్స్, జెమ్స్ ఆసుపత్రుల్లో ఉచితంగా కొవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నామ'ని డీఎంహెచ్‌వో తెలిపారు.

ముగిసిన ఏపీ పీజీ ఈసెట్

ఎచ్చెర్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఎంటెక్, ఎం.ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న ఏపీ పీజీ ఈసెట్ పరీక్షలు ఆదివారంతో ముగిశాయి. టీసీఎస్ సాంకేతిక సహాయంతో గత మూడు రోజులుగా ఆన్‌లైన్ విధానంలో ఈ పరీక్షలు నిర్వహించారు. చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు షిఫ్ట్‌ల్లో మొత్తం 8 మందికి ఆరుగురు హాజరయ్యారు.



డీఈవో కార్యాలయం వద్ద ఉపాధ్యాయుల నిరసన

బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా చేపట్టాలి

- డీఈవో కార్యాలయం ముట్టడించిన ఉపాధ్యాయ సంఘాలు

7లో

మహిళలను కించపరిస్తే సహించేది లేదు

- బాధ్యులపై చర్యలు తీసుకోండి
- స్టేషన్లలో తెలుగు మహిళల ఫిర్యాదు

8లో

శబ్దాల దడ

- డీజేలతో అలజడి
- బైకులతో కుర్రకారు ఫీట్లు
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులకు గండం
- పట్టించుకోని యంత్రాంగం





ఇచ్ఛాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి):

జిల్లాలో కుర్రకారు హుషారు సామాన్య ప్రజలను ఇబ్బందుల్లో పెడుతోంది. ఒకవైపు డీజేల మోత.. మరోవైపు సైలెన్సర్ల ద్వారా భారీ శబ్దాన్ని ఇచ్చే బైక్‌లు అసౌకర్యానికి గురిచేస్తున్నాయి. ముఖ్యంగా గుండె సంబంధిత రుగ్మతలతో బాధపడేవారికి డీజేలు, బైక్‌ల శబ్దాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా వివాహాలు, శుభకార్యాలు, గ్రామదేవత పండుగలు జరుగుతున్నాయి. ఎక్కడ చూసినా డీజేలు దర్శనమిస్తున్నాయి. శబ్దాల మోత మోగిస్తున్నాయి. అదే సమయంలో యువకులు బైకుల సైలెన్సర్లు మార్చి భారీ శబ్దాలతో రేత పుట్టిస్తున్నారు. దీంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. వాస్తవానికి డీజేలను నిషేధించినట్టు పోలీస్ శాఖ చెబుతున్నా.. ఎక్కడా అమలవుతున్న దాఖలాలు లేవు.

సైలెన్సర్లు మార్చి..

రోడ్లపై మితిమీరిన వేగంతో, అధిక శబ్దంతో వెళ్తున్న వాహనాలు ఇటీవల ఎక్కువయ్యాయి. యువకులు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లను (పొగ గొట్టాలు) మార్చి.. భారీ శబ్దాలనిచ్చే వాటిని అమరుస్తున్నారు. వైల్డ్‌బోర్, కాక్‌టైల్ షార్కర్, డాల్ఫిన్, మెగాఫోన్, టెయిల్‌గన్నర్ వంటి రకరకాల పేరుతో వచ్చే సైలెన్సర్లు భారీ శబ్దాన్నిస్తాయి. వీటి ధర ఒక్కొక్కటి రూ.10వేల నుంచి రూ.23వేల వరకూ పలుకుతోంది. అనుసంధానంగా ఇతరత్రా పరికరాలు అమర్చేందుకు మెకానిక్‌కు మరో రూ.3 వేల వరకూ చెల్లించాల్సి ఉంటుంది. వీటి ధర అధికమైనా కుర్రకారు లెక్క చేయడం లేదు. ఆరోగ్యానికి హానికరమైనా, పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నా, పోలీసులు హెచ్చ రిస్తున్నా.. బేఖాతరు చేస్తున్నారు. వాస్తవానికి వీటి వాడకం చట్ట విరుద్ధం. పోలీసులకు పట్టుబడితే భారీ జరీమానాతోపాటు జైలు శిక్ష పడుతుంది. కానీ సరికొత్త సైలెన్సర్ల నుంచి వచ్చే శబ్దానికి ఎక్కువ మంది యువత ఆకర్షితులవుతున్నారు. బైక్‌లతో రోడ్డెక్కి చుట్టుపక్కల వాహనదారుల గుండెల్లో అలజడి రేపుతున్నారు.

నిబంధనలు ఇవీ..

ఒక వాహనం నిర్దేశిత డెసిబుల్స్ కంటే ఎక్కువ శబ్ద కాలుష్యం చేస్తే అది మోటారు వాహన చట్టం ప్రకారం నేరం. నిబంధనలు ఉల్లంఘిస్తే వాహనదారుడిపై ఎంవీఐ యాక్ట్ 1988 సెక్షన్ 190(2) ప్రకారం పోలీసులు కానీ రవాణాశాఖ అధికారులు కానీ కేసు నమోదు చేయవచ్చు. సంబంధిత వాహనదారుడికి తొలిసారి అయితే రూ.1,000 జరీమానాతో పాటు కేసు నమోదు చేస్తారు. రెండోసారి పట్టుబడితే రూ.2 వేలు జరీమానాతో పాటు కఠిన చర్యలకు సిఫారసు చేస్తారు. మోటారు కంపెనీ ఉత్పత్తి చేసిన బైక్‌ను ఎట్టి పరిస్థితుల్లో విడి పరికరాలు మార్చకూడదు. ఇది చట్టరీత్యా నేరం.

అనర్థాలెన్నో..

శబ్దం తీవ్రత పెరిగే కొలదీ రుగ్మతలు ఖాయమని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 60 డెసిబుల్స్‌లోపు శబ్దం వింటే ఎటువంటి ఇబ్బందులుండవు. 100 డెసిబుల్స్ దాటితే గుండె జబ్బులు ఉన్నవారిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. 110 నుంచి 120 డెసిబుల్స్ దాటితే చిరాకుతో పాటు విపరీతమైన కోపం, తలనొప్పి వస్తుంది. 160 డెసిబుల్స్ దాటితే చెవుల్లో వినికిడి కణాలపై ప్రభావం చూపుతాయి. నరాలు దెబ్బతిని పాక్షిక వైకల్యం కలుగుతుంది. 190 డెసిబుల్స్ (మిగతా 8వ పేజీలో..)

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలి: ఎంపీ



మొక్క పంపిణీ చేస్తున్న కలిశెట్టి అప్పలనాయుడు

రణస్థలం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటాలని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు కోరారు.ఆదివారం రణస్థలంలో మొక్కలు పంపిణీ కార్యక్రమం చేశారు.ఈసందర్భంగా మాట్లాడుతూ శ్రీనిఖిల నాయుడు కలిశెట్టి చారిటిబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పదివేలు మొక్కలు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. కలిశెట్టి ప్రభానాయుడు కోష్టలో మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు డీజీఎం ఆనందరావు, దెయ్యం వసంతరావు, దెయ్యం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సిరిమానోత్సవం ప్రశాంతంగా నిర్వహించండి: ఎస్పీ



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, జూన్ 8(ఆంధ్రజ్యోతి):పెద్దమ్మతల్లి, నూకాలమ్మ తల్లి సిరిమానోత్సవం ప్రశాంతంగా నిర్వహించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి సిబ్బందికి ఆదేశించారు. సిరిమాను తిరిగేరూట్‌లో ట్రాఫిక్‌కు అంతరాయం ఉండరాదని, భక్తులకు అసౌకర్యం కలిగించవద్దని కోరారు. శ్రీకాకుళం పట్టణం, పాత శ్రీకాకుం, మావూరువీధి, కలెక్టర్ బంగ్లా, హరిజనవీధి, బాదుర్లుపేట, కొత్తపేట, కునుకుపేట, దండివీధి, దేశర్లవీధి, నక్కవీధి పరిసర వీధుల్లో మంగళవారం పెద్దమ్మతల్లి, నూకాలమ్మ తల్లి సిరిమానోత్సవం జరగనున్న నేపథ్యంలో రూట్‌మ్యాప్, బందోబస్తు, ట్రాఫిక్ మళ్లింపు తదితర ఏర్పాట్లపై ఆదివారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌తో కలిసి పరిశీలించారు. జిల్లాపరిషత్, నక్కవీధి, సంతోషిమాతగుడి, కలెక్టర్‌బంగ్లా తదితర రహదారి మార్గంలో ఎస్పీ తనిఖీచేశారు. భక్తులదర్శనం, క్యూలైన్లు, బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించి సిరిమాను వెళ్లే మార్గంలో పరిశీలించి సిరిమాను తిరిగే సమయంలో విద్యుత్ ప్రమాదాలు లేకుండా ఆ శాఖాధికారుల సాయంతో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండ తీవ్రతను బట్టి మునిసిపల్‌అధికారులు సమన్వయంతో రహదారికి ఇరువైపులా మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటుచేసుకొనే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఆలయంలోపల, క్యూలైన్లవద్ద, ముఖ్య కూడళ్లుసిరిమాను ప్రాంతంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఎస్పీ వివేకానంద సీఐలు పైడిపునాయుడు, నాగరాజు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పెంటలో కనకదుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం

జి.సిగడాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని పెంటలో గల కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. గ్రామ, పరిసర గ్రామాల నుంచి వందలాది మంది మహిళలు దుర్గాదేవికి పసుపు, కుంకుమ, ముర్రాటలు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన కుంకుమ పూజలో దంపతులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న వార్షికోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ధర్మకర్త డోల రామారావు, రామలక్ష్మి దంపతులు, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా ధనరాజ తులసమ్మతల్లి సంబరం

ఇచ్ఛాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): లొద్దపుట్టి జంక్షన్‌లో కొలువుతీరిన ధనరాజ తులసమ్మతల్లి సంబరాన్ని 21వ వార్డు గొల్లవీధికి చెందిన మహిళలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం పురవీధుల్లో అమ్మవారి ఘటాలను ఊరేగించారు. అనంతరం బిందెలతో తీసుకెళ్లిన పసుపు, కుంకుమ నీరుతో పాటు పానకాలతో అమ్మవారికి అభిషేకాలు చేశారు.

అమ్మవార్లకు చల్లదనం

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పాతశ్రీకాకుళంలోని పెద్దమ్మవారు,నూకాలమ్మకు ఆదివారం సిరిమానోత్సవాలు పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంతోషిమాత ఆలయ ఆవరణలో పెద్దమ్మ, నూకాలమ్మతల్లి దేవర వద్ద ముర్రాటలతో చల్లదనం చేశారు. అనంతరం అమ్మవారి సాంస్కృతిక కార్యక్రమాల ఆర్గనైజర్ గుత్తు చిన్నారావుదర్శకత్వంతో రౌడీ-పులి సాంఘికనాటిక ప్రదర్శించారు.ఉమా జఠశేశ్వరస్వామివారి భజనబృందంతో లలితాసహస్ర పారాయణం,షిర్డీ సంగీత విద్యాలయం, మల్లెమొగ్గల లక్ష్మీతో భక్తి సంగీత విభావరి నిర్వహించారు.

నిమ్మాషిణి అమ్మవారికి పూజలు

కంచిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):మండలంలోని మఠం సరియాపల్లిలో నిర్మించిన నిమ్మాషిణి అమ్మవారి ఆలయ ప్రతిష్ఠా కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. వేకువజామున ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాలను కలించారు. పూజల్లో మాదిన రామారావు, విమల దంపతులు, శ్రీకాంత్, నల్లాన లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.అలాగే కంచమ్మ తల్లి సంబరాల్లో భాగంగా పూజాకమిటీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఒడియా రామయణం(ఒపొరా) నాటకం ఆకట్టుకుంది. అమ్మవారిని జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూడి కిరణ్‌కుమార్, సోంపేట ఎంపీపీ నిమ్మన దాసు తదితరులు దర్శించుకున్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన

పొందూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి: మండలంలోని ధర్మపురంలో రామాలయం పునర్నిర్మాణానికి ఆలయ నిర్మాణ కమిటీ చైర్మన్ అన్నెపు రాము ఆధ్వర్యంలో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇక్కడి ఆలయం శిథిలావస్థకు చేరుకో వడంతో కొత్తగా ఆలయం నిర్మాణానికి గ్రామస్థులు నిర్ణయించారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ

కంచిలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని జక్కరలో ఆంజనేయస్వామి విగ్రహాన్ని గ్రామస్థులు ఆదివారం ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొని పూజలు చేపట్టారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

అరసవల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2004-06లో బైపీసీచదువుకున్న పూర్వవిద్యార్థులు గుజరాతీపేటలో ఆత్మీయకలయిక కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. కార్యక్రమానికి అప్పటిప్రిన్సిపాల్, రిటైర్డ్ ఆర్జేడీ సూరిబాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆనాటి అధ్యాపకులు విలాస్‌మూర్తి, వాయుకుమార్, శ్రీకృష్ణ, జోగినాయుడు, హరిప్రసాద్, అన్నపూర్ణరావు, ఫాల్గుణరావును సన్మానించారు.

స్నేహితునికి ఆర్థిక సాయం

కవిటి, జూన్8 (ఆంధ్రజ్యోతి): సీహెచ్ కపాసుకుద్ది గ్రామానికి చెందిన ఆర్.రుద్రయ్య అనారోగ్యసమస్యతో బాధపడుతుండడంతో స్నేహితులు అండగా నిలిచారు. ఆయనతో పదోతరగతి 2001లో చదువుకున్న తోటి విద్యార్థులు ఆదివారం గ్రామానికి వెళ్లి రూ.50వేలు,నెలరోజులకు సరిపడిన నిత్యావసరాలను అందజేశారు.

కిమిడి నాగార్జునకు అభినందన

ఎచ్చెర్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): డీసీసీబీ చైర్మన్‌గా కిమిడి నాగార్జున విజయనగరంలో ఆదివారం చేపట్టిన పదవీ స్వీకార కార్యక్రమంలో ఎచ్చెర్లకు చెందిన టీడీపీ నేతలు హాజరై అభినందించారు. టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ మండలాధ్యక్షుడు బెందు మల్లేశ్వరరావు, పార్టీ నేతలు పైడి ముఖలింగం, గూరు జగపతిబాబు, అల్లుపల్లి రాంబాబు హాజరయ్యారు.

పూడికలు తొలగించక.. సాగు నీరందక

- ఇదీ బైరి లింక్‌కాలువ పరిధిలో పిల్ల కాలువల దుస్థితి

గార మండలంలో 12 వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే బైరి లింక్ కాలువ పరిధిలో పిల్లకాలువల నిర్వహణ అధ్వానంగా మారింది. ఏళ్ల తరబడి పూడికలు తొలగించకపోవడంతో ఖరీఫ్‌లో సైతం పూర్తిస్థాయిలో నీరందడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.కాలువల నిర్వహణపై వైసీపీ ప్రభు త్వం దృష్టిసారించకపోవడంతో పిచ్చిమొక్కలతోపాటు పూడిక పేరుకుపోయిందని అన్నదాతలు చెబుతున్నారు.

గార,జూన్ 8(ఆంధ్రజ్యోతి):బైరి లింక్ కాలువ కింద బూరవెల్లి, శాలిహుండం, గార, కొర్ని, కొర్లాం, వమరవెల్లి, తోనంగి కళింగపట్నం తదితర పిల్ల కాలువల ద్వారా శివారు ఆయకట్టుకు నీరందుతోంది. సుమారు 12 వేల ఎకరాలకు సాగునీరందించే పిల్ల కాలువలు అధ్వానంగా మారాయి. గతఏడాది ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే గొండు శంకర్ చొరవ తీసుకోవడంతో కాలువల్లో కొన్నిచోట్ల నిర్వహణపనులు చేపట్టారు. అయితే ఆయా కాలువల్లో ఏళ్ల తరబడి పూడిక తొలగించే ప్రయత్నం చేయపోవడంతో ఖరీఫ్‌లో సైతం శివారు ఆయకట్టుకు నీరందని పరిస్థితి నెలకొంది.ఉపాధిహామీ పథకం ద్వారా వేతనదారులతో గతంలో కాలువల్లో మొక్కుబడిగా పూడిక తొలగించే పనులు చేపట్టారు. ప్రస్తుతం అడపాదడపా వర్షాలు కురుస్తుండడంతో రైతులు నారుమడులు సిద్ధంచేస్తున్నారు.ఈలోగా వర్షాలు ప్రారంభంకాక ముందేబ్రాంచ్‌కాలువల్లో పూడికతొలగించే ఏర్పాట్లుచేయాలని రైతులు జలవనరుల శాఖ అధికారులను కోరుతున్నారు.

అనుమతి వచ్చిన వెంటనే మరమ్మతులు

అనుమతి వచ్చిన వెంటనే పిల్ల కాలువలను మరమ్మతులు చేస్తామని జలవనరుల శాఖ డిప్యూటీ డీఈఈ కాశిన క్రాంతి కుమార్ తెలిపారు. గార, శ్రీకాకుళం మండలాల పరిధిలో ఉన్న సాగునీటి కాలువల్లో పూడికతొలగించడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులు అనుమతి కోసం పంపించినట్లు చెప్పారు. వారి నుంచి అనుమతులు మంజూరైన వెంటనే కాలువలు అభివృద్ధి చేసి పూర్తిస్థాయిలో సాగునీరందించే చర్యలు తీసుకుంటామని తెలిపారు.



గార వద్ద పూడికతో నిండిపోయిన బ్రాంచ్‌కాలువ



వమరవెల్లి బ్రాంచ్‌కాలువలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

బదిలీల కౌన్సెలింగ్ మాన్యువల్‌గా చేపట్టాలి

- డీఈవో కార్యాలయం ముట్టడించిన ఉపాధ్యాయ సంఘాలు

అరసవల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సెకండరీ గ్రేడ్ టీచర్లు, భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్‌ను మాన్యువల్‌గా చేపట్టాలని ఉపాధ్యాయసంఘాలు డిమాండ్ చేశాయి.ఈ మేరకు రాష్ట్ర ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక పిలుపు మేరకు వేలాది మంది ఉపాధ్యాయులు డీఈవో కార్యాలయాన్ని ఆదివారం ముట్టడించారు. బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి మాన్యువల్ కౌన్సెలింగ్‌కు మాట ఇచ్చి,వెబ్‌కౌన్సెలింగ్ చేపట్టడంతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.భానుమూర్తి మాట్లాడుతూ బదిలీల ప్రక్రియలో ఉపాధ్యాయ సంఘాలకు ఇచ్చిన మాట తప్పడం సరికాదన్నారు. యుటీఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు, ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ సంఖ్యాపరంగా అత్యధికంగాఉన్న ఎస్టీటీలకు వెబ్ కౌన్సెలింగ్‌తో ఇబ్బందులు తప్పడంలేదన్నారు. బదిలీలకు సంబంధించి ఉపాధ్యాయులను మానసిక ఇబ్బందులకు గురిచేయడం సమంజసం కాదన్నారు.ఉపాధ్యాయులకు ముందుగా హామీఇచ్చి తరువాత మండల కేంద్రాలకు వచ్చి వెబ్ ఆప్షన్లు పెట్టుకోమనడం దారుణమన్నారు.ధర్నాచేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. మాన్యువల్‌గా బదిలీలు చేపట్టేందుకు సమయం సరిపోదని అధికారులు చెబుతున్నారని, ఒకటి రెండురోజులు ఆలస్యమైనా మాన్యువల్‌విధానంలోనే బదిలీలు నిర్వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో బాబూరావు, రమణ, వేంకటేశ్వర్లు, సోమేశ్వరరావు, రమేష్, గోపాలరావు, భాస్కరరావు, ధనుంజయరావు, వసంతరావు, చౌదరి రవీంద్ర వివిధ మండలాల ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



డీఈవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

డీఎస్సీకి 188 మంది హాజరు

ఎచ్చెర్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి సంబంధించిన డీఎస్సీ ఆన్‌లైన్‌లో కొనసాగుతోంది. ఆదివారం ఎచ్చెర్లలోని శ్రీవెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షకు ఉదయం షిప్ట్‌లో 100కు 99 మంది, మధ్యాహ్నం షిప్ట్‌లో 100కు 89 మంది హాజరయ్యారు.

ఈఏపీ సెట్‌లో జిల్లా విద్యార్థుల ప్రతిభ

జిల్లాకు చెందిన విద్యార్థులు ఈఏపీ సెట్‌లో ప్రతిభచూపారు.ఈ మేరకు ఆదివారం విడుదలచేసిన ఫలితాల్లో పలువురు ఉత్తమ ర్యాంకులు సాధించారు.

- పోలాకి, జూన్ 8(ఆంధ్రజ్యోతి):తోటాడకు చెందన తర్ర మైత్రి అగ్రికల్చర్ ఫార్మసీ విభాగంలో 33వర్యాంక్ సాధించింది. తల్లి కళావతి గార కేజీబీవీలో తెలుగు ఉపాధ్యాయిని, తండ్రి వైకుంఠరావు శ్రీకాకుళంలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు.
- పలాస:కాశీబుగ్గకు చెందిన లఖినాన శ్రీకర్ కశ్యప్‌కు ఇంజనీరింగ్ విభాగంలో 133వ ర్యాంకు సాధించాడు. తల్లిదండ్రులు ఎల్.వెంకటాచలం,శ్రీదేవి ఉపాధ్యాయులు.
- నందిగాం:నౌగాం గ్రామానికి చెందిన వలసకూలీ కుసుమూరు గణపతి కుమారుడు మౌళి అగ్రికల్చర్, ఫార్మసీలో బైపీసీ విభాగంలో 177వర్యాంకు పొందాడు. గణపతి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వలస కూలీగా పనిచేస్తున్నాడు.
- జలుమూరు (సారవకోట): మహిసింగికి చెందిన లుకలాపు శరణ్‌సాయి ఇంజనీరింగ్ విభాగంలో 204వ ర్యాంకు సాధించాడు. తండ్రి హిమగిరి స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు.
- సంతబొమ్మాళి: బోరుభద్రకు చెందిన మణిపాత్రుని వినయ్‌కుమార్ ఇంజనీరింగ్‌విభాగంలో 535వ ర్యాంక్ సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ ఆలిండియాలో 9,900 ర్యాంక్, ఈడబ్ల్యూఎస్ విభాగంలో 1,220వ ర్యాంక్ సాధించారు. వినయ్‌ను తల్లిదండ్రులు శ్రీనివాస్, సునీత తదితరులు అభినందించారు.



వినయ్ కుమార్

- సంతబొమ్మాళి: కోశీపురానికి చెందిన దాసరి సాయిచరణ్ అగ్రి,ఫార్మా విభాగంలో 172వ ర్యాంక్ సాధించాడు. సాయి చరణ్ తల్లిదండ్రులు గోవిందరావు, భాగ్యలక్ష్మి వ్యవసాయం చేస్తున్నారు.
- పలాసరూరల్: రెంటికోటకు చెందిన కుసిరెడ్డి సాయిఅనీష్ 667వ ర్యాంకు సాధించాడు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌ఫలితాల్లో 5822, ఓబీసీలో 1110 ర్యాంకు సాధించి సత్తా చాటాడు. సాయిఅవినాష్ తండ్రి కుశిరెడ్డి గంగాధర రావు రైల్వేలో లోకోపైలెట్‌గా, తల్లి మమతా రెడ్డి ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు.



సాయిఅనీష్

- ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురానికి చెందిన అంజన 1036వ ర్యాంకు సాధించింది.

దివ్యాంగులకు ప్రోత్సాహం

- శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్



పారా స్పోర్ట్స్ చైతన్యయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

అరసవల్లి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు ప్రభుత్వం అండగా ఉండి ప్రోత్సహిస్తుందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. దివ్యాంగులకు క్రీడల్లో ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలపై అవగాహన కల్పించేందుకు పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర ఆదివారం శ్రీకాకుళం చేరుకుంది.ఈ మేరకు వారంతా శ్రీకాకుళంలో ఎమ్మెల్యేను కలుసుకున్నారు.ఈసందర్భంగా ఎమ్మెల్యే చైతన్య యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.జాతీయస్థాయిలో ప్రతిభచాటిన వారిని సత్కరించారు.కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వి.రామస్వామి, విజయనగరం గౌరవాధ్యక్షుడు కె.దయానంద్, డాక్టర్ షీతల్ మదన్, సురేష్, పారా స్విమ్మర్ రవి కుమార్, అంతర్జాతీయ క్రీడాకారిణి శివగంగ పాల్గొన్నారు.

- శ్రీకాకుళంలోని ఎన్జీవో హోమ్‌లో జిల్లా పద్మశాలి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో 2024-25లో పదోతరగతిలో 550 మార్కులు పైబడి సాధించిన, విద్యార్థులకు ప్రతిభాపురస్కారాలను గొండు శంకర్ అందజేశారు.కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులు,ట్రాఫిక్ సీఐనాగరాజు, మాజీకౌన్సిలర్ పాండ్రంకి శంకర్‌పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

కంచిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ప్రశాంతత లభిస్తుందని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని తలతంపరలోగల సీతయ్య ఫౌండేషన్‌లో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ ఎన్.రమేష్ కుమార్, ఎంపీడీవో వి.తిరుమలరావు, ఎంఈవో ఎస్ .శివరాం ప్రసా మాట్లాడుతూ యోగాతో శారీరకంగానే కాకుండా మానసికంగా ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.

- ఇచ్ఛాపురం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగా శిక్షణా తరగతుల్లో భాగంగా యోగా సాధన విధానం, అభ్యసించాల్సిన యోగాసనాలపై యువతకు అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పతాంజలి యోగా గురువు సంజీవరెడ్డి అందజేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకొని హరిద్వార్ పతాంజలి యోగా పీఠం యోగరుషి స్వామి రాందేవ్‌బాబా ఇచ్ఛాపురం చేరుకున్నారు.ఆయనకు ఆదివారం బాబా శిష్యులు చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఈశ్వరరెడ్డి, యోగా గురువు సంజీవ్ రైల్వేస్టేషన్‌లో కలిశారు.

టీడీపీ బలోపేతానికి కృషిచేయాలి

జి.సిగడాం, జూన్8(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్క్‌ఫెడ్ డైరెక్టర్, తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడ ఆనెపు రామకృష్ణంనాయుడు, టీడీపీ నాయకుడు కలిశెట్టి సూర్యనారాయణ కోరారు. తమ ప్రభుత్వంతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమని తెలిపారు. ఆదివారం పెంటలో టీడీపీ కార్యకర్తలతో మాట్లాడారు.ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏడాదిలోనే గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి బాటలు వేసిందన్నారు. రాష్ట్రాభివృద్ధిపై ముందు చూపు ఉన్న చంద్రబాబు ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధిచేసి చూపిస్తారన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరిస్తాం

కవిటి, జూన్8(ఆంధ్రజ్యోతి): జిల్లా, మండలపరిషత్ నిధులతో రెండుబోర్లు వేసి తాగునీటి సమస్యను పరిష్కరిస్తామని జడ్పీ చైర్‌పర్సన్ పి.విజయమ్మ,ఎమ్మెల్సీ ఎన్.రామారావు తెలిపారు.ఆదివారం సిహెచ్ కపాసుకుద్ది పంచాయతీ కొరికాన పుట్టుగ గ్రామంలోని మంచినీటి పథకాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.దమయంతి, భీమసేన్, కె.ప్రకాష్, పి.శ్రీరాములు, పి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి యోగా పోటీలు

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు జిల్లా స్థాయి యోగా పోటీలను నిర్వహించనున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్ సమీపంలోని డీఆర్డీఏకాంప్లెక్స్‌లోని వెలుగు భవన్ ప్రాంగణంలో ప్రతిరోజూ ఉదయం 7:30 గంటల నుంచి పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆసనాలు, సూర్య నమస్కారాలు, ప్రాణాయామం, ధ్యానం, యోగా పాటలు, చిత్రలేఖనం, స్కిట్, పోస్టర్ ప్రదర్శన, క్విజ్‌తదితర అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి విజేతలు మండలానికి, మండల స్థాయి విజేతలు జిల్లాస్థాయికి, అక్కడ నుంచి రాష్ట్రస్థాయికి ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. వయస్సు ఆధారంగా జూనియర్ గ్రూప్ 10 నుంచి 18 సంవత్సరాలు, యువ గ్రూప్ 19 నుంచి 35 సంవత్సరాలు, సీనియర్ గ్రూప్ 35ఏళ్ల పైబడిన వారిగా విభజించినట్లు తెలిపారు. పోటీల నిర్వహణ బాధ్యతలను వ్యవసాయశాఖ ఏడీ త్రినాథస్వామి, డీఎంహెచ్‌వో కె.అనిత, డీసీహెచ్‌ఎస్ కళ్యాణబాబు, ఆయుష్ అధికారి పి.జగదీష్ పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు.

నేడు పీజీఆర్ఎస్

శ్రీకాకుళం కలెక్టరేట్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల నమోదు పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) సోమవారం నిర్వహించను న్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు అర్జీలను మీకోసం.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. అర్జీల నమోదు, వాటి స్థితిగతుల గురించి వివరాలను 1100 నెంబర్‌కు నేరుగా కాల్ చేసి తెలుసుకోవచ్చని తెలిపారు.

ఇచ్ఛాపురం వరకూ రైల్వేజోన్‌లో కలపాలి



విప్ అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇచ్ఛాపురం వాసులు

కవిటి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రైల్వేజోన్‌లో ఇచ్ఛాపురం వరకు కలిపి న్యాయం చేయాలని పట్టణానికి చెందిన కె.శంకరరెడ్డితో పాటు యువకులు కోరారు. ఈ మేరకు ఆదివారం రామయ్యపుట్టుగలో ప్రభుత్వ విప్ బి.అశోక్‌ను కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విశాఖ వరకు జోన్ పరిధిని ఇచ్చి జిల్లా వాసులకు తీరని అన్యాయం చేశారన్నారు. జిల్లాలోని రైల్వేస్టేషన్లను కలుపుతూ ఇచ్ఛాపురం వరకూ జోన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

దోమల నివారణ మందు పిచికారీ

ఎచ్చెర్ల, జూన్ 8(ఆంధ్రజ్యోతి): దుప్పలవలసలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల/కళాశాలలో దోమల నివారణ మందును పొన్నాడ పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో ఆదివారం పిచికారీ నిర్వహించారు. మలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యాకు కారణమైన దోమల నివారణకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా పిచికారీ చేశారు.కార్యక్రమంలో పీహెచ్‌సీ సబ్ యూనిట్ అధికారి సూర్య అప్పారావు, ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.డేవిడ్‌రాజు, హెల్త్ అసిస్టెంట్ ఇప్పిలి చిట్టిబాబు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ఆమదాలవలస, జూన్ 8(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొరపాం రైతు సేవాకేంద్రంలో సబ్సిడీపై రైతులకు వరి విత్తనాలను ఆదివారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ చేపాన సత్తిరాజు మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, జీకేవలస, మాజీ సర్పంచ్ కోరుకొండ రమణమూర్తి, జనసేన నాయకులు పంచిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

స్కేటింగ్‌ను విస్తరించేందుకు చర్యలు

- జిల్లా క్రీడాభివృద్ధి అధికారి శ్రీధర్

శ్రీకాకుళంస్పోర్ట్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): స్కేటింగ్‌ను జిల్లా వ్యాప్తంగా విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కె.శ్రీధర్ తెలిపారు. ఆదివారం శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీ గల ఇండోర్ స్టేడియం దరిలో స్కేటింగ్ జోన్ వద్ద జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. జిల్లాలో స్కేటింగ్‌ను విస్తరించేందుకు విశాఖపట్నం నుంచి 30 మందితో కూడిన స్కేటింగ్ క్రీడాకారులు శ్రీకాకుళం వచ్చినట్లు తెలిపారు.పలాస, సోంపేట ప్రాంతాల్లో స్కేటింగ్ చేసేవారున్నా రన్నారు. శ్రీకాకుళంలో ప్రయోగాత్మకంగా సమ్మర్ సమ్మర్ కోచింగ్ విజయవంతంగా ముగిసిందన్నారు. కార్యక్రమంలో జిల్లా టూరిజం అధికారి ఎస్.నారాయణరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి మెంటాడ సాంబమూర్తి, స్కేటింగ్ కోచ్ రవికుమార్, రాంజీ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీధర్

లోకబాంధవ శతకం గ్రంథావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలోని ఉపనిషన్మందిరంలో అవధాని పైడి హరనాథరావు రచించిన లోకబాంధవ శతకం పుస్తకాన్ని ఆదివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గుమ్మా నగేష్, విశ్వనాథం కామేశ్వరరావు, నిష్టల నరసింహమూర్తి, పతంజలి శాస్త్రి పాల్గొన్నారు.

షైనింగ్ స్టార్ అవార్డుకు ఆరుగురి ఎంపిక

కంచిలి, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరుగురు షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యారని ఎంఈవో ఎస్.శివరాం ప్రసాద్ తెలిపారు. డిజిపురం ఉన్నతపాఠశాలకు చెందిన బహూన్ ప్రధాన్, జున్నూరు గాయిత్రి, జేఎంజే పాఠశాలకు చెందిన దుంప సాయి శిరీషా రెడ్డి, వంకాయల శృతి, వడ్డాది భాస్కర్ చరణ్ రతో, వైష్ణవి బి సాయిలు ఎంపికకావడంతో అభినందించారు. అలాగే కత్తివరం పాఠశాలకు చెందిన కోరాడ రక్షిత నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్ షిప్‌కు ఎంపికైనట్లు హెచ్‌ఎం మాధవి బెహరా తెలిపారు.

- సోంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సోంపేట మోడల్ స్కూల్ విద్యార్థిని దండాసి దీప్తి నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ ఫలితాల్లో సత్తాచాటినట్లు ప్రిన్సిపాల్ చిన్నాజి వర్మ తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ కింద ఏటా రూ.12 వేలు అందుతుందని పేర్కొన్నారు. అలాగే అదే పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని దవళ ఈశ్వరి షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ అవార్డు కింద 20 వేల రూపాయల నగదు ప్రోత్సాహకాన్ని అందజేస్తారని ఆయన తెలిపారు.

మహిళలను కించపరిస్తే సహించేది లేదు

● బాధ్యులపై చర్యలు తీసుకోండి ● స్టేషన్లలో తెలుగు మహిళల ఫిర్యాదు

అమరావతి మహిళలను కించపరుస్తూ మాట్లాడిన వారిపై చర్యలు తీసుకోవాలని తెలుగు మహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధ్యులైన పొలిటికల్ ఎనలిస్ట్ కృష్ణంరాజు, యాంకర్ కొమ్మినేని శ్రీనివాసరావులతో పాటు సాక్షి టీవీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఆదివారం జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో తెలుగు మహిళలు ఫిర్యాదు చేశారు. ఎవరైనా మహిళలను కించపరుస్తూ మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. -ఆంధ్రజ్యోతి బృందం


వజ్రపుకొత్తూరు: ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళలు


అరసవల్లి: ఒకటో పట్టణ ఎస్ఐకి తెలుగు మహిళల ఫిర్యాదు


ఇచ్ఛాపురం: సీఐకి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు


ఆమదాలవలసలో..


పాతపట్నంలో..


కొత్తూరులో..

కొనసాగుతున్న కంకర తవ్వకాలు

● రూపు కోల్పోతున్న సూదికొండ


ఎక్స్‌కవేటర్‌తో కంకరను తవ్వుతున్న దృశ్యం

పలాస, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ సూదికొండ వద్ద కంకర తవ్వకాలు 24 గంటలూ సాగుతుండడంతో విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం రాత్రి కంకర తవ్వకాలు చేపట్టడంతో రెవెన్యూ అధికారులకు సంబంధిత వ్యక్తులను హెచ్చరించడంతో తవ్వకాలు ఆపారు. సూదికొండ వద్ద మొత్తం 10 ఎకరాల స్థలాన్ని కేంద్రీయ విద్యాలయానికి మంజూరు చేశారు. ఈ ప్రాంతంలో అక్రమ కట్టడాలు ఉండడంతో వాటిని రెవిన్యూ అధికారులు కూల్చివేసిన సంగతి తెలిసిందే. దీంతో గోతులు ఏర్పడగా వాటిని తీసుకొని సుడా ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఎంఐజీ లేఅవుట్‌లో మట్టిని వేసేందుకు కలెక్టర్ అనుమతులిచ్చారు. దీంతో కొద్ది రోజులు చదును చేశారు. అయితే చాలినంతగా మట్టి, కంకర లేకపోవడంతో కొండను సైతం చదును చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నారు. టిప్పర్లతో వందల లోడులను తీసుకువెళ్తుండడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే సూదికొండలో మట్టి తవ్వకాలు జరిగిన రూపం కోల్పోగా మళ్లీ అనుమతులు లేకుండానే కంకరను తవ్వుతున్నారు. అక్రమ తవ్వకాలను నిలువరించాలని స్థానికులు కోరుతున్నారు.

కుక్క అడ్డుగా రావడంతో..

● స్తంభానికి వాహనం ఢీకొని ఒకరి దుర్మరణం

గార, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం రోడ్డులో కుక్క అడ్డంగా రావడంతో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి స్తంభానికి ఢీకొని దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. పొందూరు మండలంలోని మొదలవలస ఎస్సీ కాలనీకి చెందిన రావాడ ఆనందరావు(28)తోపాటు తన స్నేహితుడు దూగాన గణపతి కలిసి ద్విచక్ర వాహనంపై ఆదివారం సాయంత్రం శ్రీకూర్మం వెళ్తున్నారు. ఆ సమయంలో కుక్క అడ్డంగా రావడంతో ద్విచక్రవాహనం తప్పించే క్రమంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొంది. దీంతో ఆనంద రావుకు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన గణపతికి ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్పించారు. గార ఎస్ఐ చంద్రమోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట శిబిరంపై దాడి

రణస్థలం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): వరిశాం గ్రామానికి సమీపంలోని ఓ లేఅవుట్‌లో జరుగుతున్న పేకాట శిబిరంపై ఆదివారం జేఆర్‌పురం పోలీసులు దాడి చేశారు. ఈ దాడుల్లో 11 మంది పేకాట రాయుళ్లను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ 44, 950 నగదు, 11 సెల్ ఫోన్లు, మూడు ద్విచక్ర వాహనాలను స్వాధీన పరుచుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి చెప్పారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి


రోడ్డు పనులను పరిశీలిస్తున్న పీఆర్ డీఈఈ రాధారాణి

పాతపట్నం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని పంచాయతీరాజ్ డీఈఈ ఎస్.రాధారాణి అన్నారు. బీటీ రోడ్డు నుంచి ద్వారకాపురం వరకు రోడ్డు పనులను ఆదివారం పరిశీలించారు. ప్రధానమంత్రి గ్రామీణ రహదారుల పథకంలో భాగంగా రూ. 63 లక్షలతో పనులు చేపడుతున్నామన్నారు. పనులపై పర్యవేక్షణ ఉండాలని, సకాలంలో పూర్తి చేయాలని సూచించారు.

నవధాన్యాల సాగుతో మేలు


సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

కొత్తూరు, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నవధాన్యాల సాగుతో రైతులకు మేలు చేకూరుతుందని ప్రకృతి వ్యవసాయం డివిజనల్ యూనిట్ ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మాకవరంలో రైతు లకు నవధాన్యాల సాగు విధానంపై అవగాహన కలిగించారు. సుమారు మూడెకరాల విస్తీర్ణంలో నవధాన్యాలు ఏ మేర విత్తనాలు వేయాలని, అధిక ఆదాయం ఎలా వస్తుంది అన్న అంశాలను వివరించారు. కార్యక్రమంలో రైతులు పొత్రకొండ శేషగిరి, ధనలక్ష్మి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక వికాసం


యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

టెక్కలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక వికాసం కలుగుతుందని, మానసిన ఒత్తిడిని జయించవచ్చునని ఆయుష్ వైద్యులు ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వయోవృద్ధుల ప్రత్యేక యోగా శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా మానవ జీవితంలో ఒక భాగం కావాలన్నారు. ఈ కార్య క్రమంలో పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రోణంకి రామచంద్రరావు, ఉపగణాంకాధికారి పీసీ నందా, ప్రసాదరావు, యోగా అధ్యాపకులు చంద్రశేఖర్, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత

పలాస, జూన్ 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పలు గ్రామాల్లో ఆదివారం ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. గ్రామాల్లో అమ్మవారి సంబరాలు, విగ్రహ ప్రతిష్ఠోత్సవాలతో సందడి నెలకొంది. ఇందులో భాగంగా అంతరకుడ్డ గ్రామంలో గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సిరిమాను ఉత్సవంలో ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్, పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామమంతా పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ఊరంతా సందడి నెలకొంది. కాశీబుగ్గ పొందరవీధిలో వెలసిన పెంటపోలమ్మ అమ్మవారి జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం సెలవు దినం కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. మునిసిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు దంపతులు అమ్మవారికి దర్శించుకొని మొక్కులు చెల్లించారు.


పలాస: అమ్మవారికి అభిషేకం చేస్తున్న మునిసిపల్ చైర్మన్ గిరిబాబు దంపతులు, అంతరకుడ్డలో దర్శించుకుంటున్న ఎమ్మెల్యేలు అశోక్, శిరీష

ఘనంగా గ్రామ దేవతా విగ్రహాల పునః ప్రతిష్ఠ


ప్రత్యేక పూజల్లో పాల్గొన్న దంపతులు

హరిపురం, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బాలిగాం గ్రామంలో ఆదివారం గ్రామ దేవత ఆలయాల్లో కొత్తమ్మతల్లి, పాతపట్నం అమ్మతల్లి, చింతామణి అమ్మతల్లి, కొత్తకాలమ్మ తల్లి విగ్రహాలను ఆదివారం పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా పూర్ణకుంభాలు, పసుపు, కుంకుమ, ముర్రాటలతో అమ్మ వార్లకు చల్లదనం చేశారు. కుంకుమ పూజలు, శాంతి హోమం చేపట్టారు. ఎమ్మెల్యే గౌతు శిరీష పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, పెద్ద ఎత్తున గ్రామస్థులు పాల్గొన్నారు.

మర్రిపోలమ్మ ఉత్సవాలు ప్రారంభం


మెళియాపుట్టి: ముర్రాటలు తీసుకువెళుతున్న గ్రామస్థులు

మెళియాపుట్టి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో మర్రిపోలమ్మ అమ్మవారి ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం వరకు జరిగే ఉత్సవాల్లో భాగంగా అమ్మవార్లకు ముర్రాటలు పోసి చల్లదనం చేశారు. అలాగే ఆలయం వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులతో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

పీవీపురం, మదనాపురంలో..

నందిగాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రతాపవిశ్వనాథపురం, మదనాపురం గ్రామాల్లో గ్రామదేవత ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ప్రతాపవిశ్వనాథపురంలో పాలపోలమ్మ, మదనాపురంలో చింతలపోలమ్మ గ్రామదేవత ఉత్సవాలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నారు. మేళతాళాలు, భక్తుల కోలాహలం మధ్య అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి దేవర్లను ఊరేగింపుగా తీసుకు వచ్చారు. పలు కూడళ్లలో దేవతామూర్తుల విగ్రహాలను విద్యుద్దీపాలతో అలంకరించారు.

శ్రీముఖలింగం ఆలయంలో..


హోమం చేస్తున్న అర్చకుడు

జలుమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర ఆలయంలో ఆదివారం ఔపోషణ హోమాన్ని నిర్వహించారు. పాంచరాత్ర కల్యాణ మహోత్సవాల్లో భాగంగా పార్వతీ పరమేశ్వరులకు సద్యోజాత విధానంలో పూజానంతరం ఆలయంలోని దుండి వినాయకుని వద్ద ఔపోషణ హోమం చేపట్టారు. అంతకు ముందు గణపతి పూజ, పుణ్యాహవచనం, కలశారాధన, మండపారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం బలిహరణ చేపట్టి అష్టదిక్పాలకులకు మంగళహారతులిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు నారాయణమూర్తి, వెంకటాచలం, అప్పారావు, యోగి, శివ, శ్రీకృష్ణ, అచ్యుత దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

జలుమూరు, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): కరవంజ పంచాయతీ మట్టవానిపేటలో కొలువుదీరిన అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ తృతీయ వార్షికోత్సవంలో భాగంగా గ్రామ పురోహితులు తెలికిచర్ల సాంబమూర్తి ఆధ్వర్యంలో అర్చకుడు వసనాభి గురునాథరావు నేతృత్వంలో మహిళలు కుంకుమ పూజలు చేశారు. సోమవారం స్వామివారి సన్నిధిలో అన్నసంతర్పణ నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.


సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

న్యూస్ బాక్స్

సిమెంట్ బెంచీల వితరణ

టెక్కలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): శైవ క్షేత్రమైన రావివలస గ్రామానికి విశ్రాంత ఉద్యోగి జీవీ రెడ్డి నాలుగు సిమెంట్ బెంచీలను ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలకృష్ణ, సుధాకర్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'షైనింగ్ స్టార్స్' అవార్డుకు విద్యార్థినుల ఎంపిక

పోలాకి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఈదులవలస మోడల్ స్కూల్‌లో పదో తరగతి చదివి మంచిమార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థినులు షైనింగ్ స్టార్స్ అవార్డుకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఫైడి ప్రవీణ తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడుతూ.. పాఠశాల నుండి శృంగారం శ్రీవల్లి (మబగాం), రుంకు సుష్మిత(దీర్ఘాశి) ఎంపికయ్యారన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జరుగు కార్యక్రమంలో నగదు పురస్కారం, ప్రశంసాపత్రం అందిస్తారని చెప్పారు.

14న చాపరలో రక్తదాన శిబిరం

మెళియాపుట్టి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టిలో ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు బ్రహ్మకుమారి సుధారాణి తెలిపారు. ఓంశాంతి భవనంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 14న బ్లడ్ డోనర్ డే సందర్భంగా రక్తదాన శిబిరంలో యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

పరిశుభ్రత పాటించాలి

మెళియాపుట్టి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామంలో పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీ వో ప్రసాద్ పండా తెలిపారు. ఆదివారం మెళియాపుట్టిలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో మూడు రోజుల పాటు అమ్మవారి సంబరాలు జరుగుతున్నందున చెత్తను ఆరుబయట వేయకుండా చెత్తకుండీలోనే వేయాలని, ఈ దిశగా ప్రజలకు అవగాహన కలిగించా లని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చింతల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన ప్రహరీ


కూలిపోయిన ప్రహరీ

ఎల్.ఎన్.పేట, జూన్ 8(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి భయంకరమైన ఉరుములు, మెరుపులతోపాటు బలమైన ఈదురుగాలులు వీచాయి. భారీ వర్షం కురిసింది. ఈదురుగాలులకు జగన్నాథపురం సమీపంలోని ఓ రైస్‌మిల్లు ప్రహరీ నేలకొరిగింది. ప్రహరీ కూలడంతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని మిల్లు యజమాని తెలిపారు.

పారా క్రీడాకారులకు ప్రభుత్వ ప్రోత్సాహం


చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

పోలాకి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): పారా క్రీడాకారులు (దివ్యాంగులు)కు ప్రభుత్వం నగదు ప్రోత్సాహకాలు అందిస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి తెలిపారు. ఆదివారం కత్తెరవానిపేట క్యాంపు కార్యాలయంలో ఏపీ పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పారా స్పోర్ట్స్ చైతన్య యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీఓ నంబర్ 4 ద్వారా 3 శాతం ప్రభుత్వ ఉద్యోగాలకు రాతపరీక్ష లేకుండా నేరుగా పారా క్రీడల్లో పాల్గొన్న దివ్యాంగులకు అవకాశం కల్పించడం శుభపరిణామమన్నారు. పారా క్రీడాకారుల జాతరను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వి.రామస్వామి, కె.దయానంద్, శీతల్ మదన్, సురేష్, రమణమూర్తి, అచ్యుతరావు, రవికుమార్, శివగంగ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అవసరం

పోలాకి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండడం ద్వారా ఆరోగ్యకర జీవనం సాధ్యపడుతుందని ఒడిశా రాష్ట్రం దేవానందాశ్రమ అధ్యక్షుడు అలియాన వినయ్ కుమార్ స్వామి అన్నారు. ఆదివారం చింతాడపేట రామయోగి సేవాశ్రమంలో సత్సంగం నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ భక్తిభావం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పాతపట్నంకు చెందిన ఆధ్యాత్మికవేత్త తూలుగు తిరుపతిరావ, సేవాశ్రమ అధ్యక్షుడు బమ్మిడి విశ్వనాథం, బొడ్డేపల్లి అప్పలనాయుడు, సింగుపురం లక్ష్మణస్వామి, ధర్మకర్త అనంతస్వామి తదితరులు పాల్గొన్నారు. సొండిపేట గ్రామస్థులు భజన కార్యక్రమం నిర్వహించారు.

నిర్మానుష్యం


టెక్కలిలో నిర్మానుష్యంగా ఉన్న రోడ్డు

టెక్కలి, జూన్ 8(ఆంధ్రజ్యోతి): రోహిణీ కార్తె చివరిరోజు ఎండ తన ప్రభావాన్ని చూపింది. సుమారు 40 డిగ్రీల ఎగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడం, వడగాల్పులతో జనం అల్లాడిపోయారు. ఆదివారం టెక్కలి ఇందిరాగాంధీ కూడలి, తెంబూరు రోడ్డు జంక్షన్, అంబేద్కర్ జంక్షన్, ఆర్టీసీ కాంప్లెక్స్ తదితర ప్రాంతాలు జనసంచారం లేక నిర్మానుష్యంగా కనిపించాయి. మధ్యాహ్నం కర్ఫ్యూ వాతావరణాన్ని తలపించింది. వాహనచోదకులు, పాదచారులు రోడ్లపై లేక వెలవెలబోయాయి. ఎండవేడిమిని తట్టుకోలేక దుకాణాలు సైతం మూసివేశారు. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇక్కట్లకు గురయ్యారు.

పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలి

పలాసరూరల్,జూన్8(ఆంధ్రజ్యోతి): రాయితీపై అందిస్తున్న పశుదాణాను సద్వినియోగం చేసుకోవాలని పశువైద్యాధికారి మధుబాబు అన్నారు. లొద్దభద్ర గ్రామంలో ఆదివారం రైతులకు పశుదాణాను పంపిణీ చేశారు. పశువులు కలిగిన రైతులు వారి పేర్లు నమోదు చేసుకొని పశు దాణాను పొందవచ్చన్నారు. ఏఎంసీ చైర్మన్ వంకల కూర్మారావు, గ్రామపెద్దలు బి.శంకరరావు, ఎస్.సింహాచలం, రైతులు పాల్గొన్నారు.

రేపటి వరకు ఏపీ సేవా పోర్టల్‌కు అంతరాయం

నందిగాం, జూన్ 8(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఏపీ సేవా పోర్టల్‌కు మంగళవారం వరకు అంతరాయం కలుగుతుందని ఎంపీడీవో కుమార్ పట్నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ సూచన మేరకు మైక్రోసాఫ్ట్ క్లౌడ్‌ను రాష్ట్ర డేటా సెంటర్‌కు తరలిస్తున్నందున ఈ సేవలు మంగళవారం రాత్రి వరకు అందుబాటులో ఉండవన్నారు. ఆదాయ, కుల ధ్రువీకరణ పత్రాలు, మ్యుటేషన్లు, రేషన్, రైస్‌కార్డులు, వృద్ధాప్య, వివాహ ధృవీకరణ పత్రాలు తదితర పది సేవలకు అంతరాయం కలుగుతుందని, ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

శబ్దాల దడ

(ఐదో పేజీ తరువాయి)

శబ్దం దాటితే కర్ణభేరి పగిలిపోతోంది. శాశ్వతంగా వినికిడి శక్తి కోల్పోతారు. పూర్వపు స్థితి రావడం చాలా కష్టమని వైద్యనిపుణులు చెబుతున్నారు.

● డీజేలపై నిషేధం..



అధిక శబ్దం కలిగించే డీజేల వినియోగం నిషేధం. భారీ శబ్దం ఇచ్చే సైలెన్సర్లను వినియోగించడం నేరం. కళాశాల యువకులు ఎక్కువగా వీటిని వినియోగిస్తున్నట్టు తనిఖీల్లో తేలింది. పిల్లల కదలి కపై, వారు వినియోగించే బైక్‌లపై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలి. అధిక శబ్దం ఇచ్చే సైలెన్సర్లను తొలగించకపోతే జరీమానా తోపాటు కేసులు నమోదు చేస్తాం. డీజేల వినియోగంపై ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటాం.
-మీసాల చిన్నమనాయుడు, సీఐ

వ్యాధులపై ప్రభావం..



ఎక్కువ డెసిబుల్ శబ్దం కలిగించే డీజేల శబ్దాలు, సైలెన్సర్లతో అనర్థాలు అధికం. వినికిడి లోపంతో పాటు మానసిక వ్యాధులు కలుగుతాయి. గుండె సంబంధిత వ్యాధులు ఉన్నవారు ఈ శబ్దం వింటే పెను ప్రభావం చూపుతుంది. సైలెన్సర్ల వల్ల చిరాకు, విపరీతమైన కోపం, తలనొప్పికి కారణమవుతాయి. యువత ఇటువంటి వాటికి దూరంగా ఉండాలి.
-డాక్టర్ ఉలాల కోదండరాము, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, ఇచ్ఛాపురం

కొత్త టవర్లు.. పాత కష్టాలు!

(ఐదో పేజీ తరువాయి)

ఇంజనీరింగ్ అధికారులు చెబుతున్నారు. ఈ దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

ఆగస్టు నాటికి..

మారుమూల ప్రాంతాల్లో ఉన్న టవర్లకు సైతం.. ఆగస్టు నాటికి పూర్తిస్థాయిలో సిగ్నల్స్ అందుబాటులోకి వస్తాయి. సుమారు 15 టవర్లకు సాంకేతిక పనులు జరుగుతున్నాయి. అలాగే ఫైబర్‌నెట్ పనులు చేస్తున్నాం. సిగ్నల్స్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపడుతున్నాం.
-రమణరావు, సెల్ టవర్ ఇంజనీర్, టెక్కలి